

శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమాండింగ్ ఆఫీసర్-1 కల్నల్ రవీంద్రరావు

రక్తదానంకు యువత ముందుకురావాలి

రాయదుర్గం: రక్తదానం చేయడానికి ఔత్సాహిక యువత ముందుకు రావాలని తెలంగాణ ఆర్‌టీ బ్యాటరీ ఎన్‌సీసీ హైదరాబాద్ గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్-1 కల్నల్ బి రవీంద్రరావు సూచించారు. మనూ విశ్వవిద్యాలయంలోని హెల్త్ సెంటర్‌లో మనూ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్లు, విక్టోరియా వెల్ఫేర్ సొసైటీ, శ్రీకర బ్లడ్‌బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, రక్తదానం చేయడంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. 100 మంది విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సిబ్బంది రక్తదానం చేశారు.

'దేవుడా..మా గాంధీని గెలిపించు'



పూజలో బీఆర్ఎస్ నాయకులు



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో గాంధీ

శివాలయంలో బీఆర్ఎస్ నేతల ప్రత్యేక పూజలు

రాయదుర్గం: 'దేవుడా..మా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని మరోసారి గెలిపించు' అంటూ మంగళవారం గౌలిదొడ్డిలోని శివాలయంలో గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ నేతలు శివుడిని వేడుకున్నారు. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు గణేష్ ముదిరాజ్ తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గౌలిదొడ్డి, కేశవనగర్‌లో ప్రచారం చేశారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించాలి

రాయదుర్గం: బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి మరోసారి అవకాశం కల్పించాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా కోరారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డి, కేశవనగర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను అందించారు. ఈ ప్రచారంలో నాయకులు రాజునాయక్, గణేష్‌ముదిరాజ్, జంగయ్య యాదవ్, సతీష్, నరేష్, అంజమ్మ, రాజుముదిరాజ్, జగదీష్ పాల్గొన్నారు.

గాంధీని అధిక మెజార్టీతో గెలిపించుకుందాం

మియాపూర్ : ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని అధిక మెజార్టీతో గెలిపించుకుందామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ కాలనీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

హఫీజ్‌పేట్ : యువత చూపు బీఆర్ఎస్ వైపు ఉందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, వేముకుంట కాలనీలకు చెందిన వివిధ పార్టీల నాయకులు డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంను ఎంతగానో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కాలనీలవాసులు పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటేయాలి

హఫీజ్‌పేట్ : సుస్థిర పాలన కావాలంటే కారు గుర్తుకు ఓటేయాలని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చందానగర్ డివిజన్ పరిధిలోని సురక్ష ఎన్‌క్లేవ్ కాలనీలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో మహిళలు కాలనీ వాసుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, యశ్వంత్, నరేందర్, బిల్లా, రాహుల్, సికిందర్, అవినాష్‌రెడ్డి, వెంకటేష్, దీక్షిత్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగోరోజు.. 3 నామినేషన్లు

● 11కు చేరిన సంఖ్య

గచ్చిబౌలి: నాలుగో రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముగ్గురు నామినేషన్లు వేశారు. ఇండిపెండెంట్లు, ఎంసీపీఐ(యు), ఇండియన్ ప్రజా పార్టీ నుంచి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో మొత్తం నామినేషన్ల సంఖ్య 11కు చేరింది. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఎం.సాంబశివప్రసాద్, కొండపల్లి రాములు, ఎం.ప్రభు నామినేషన్ల పత్రాలను ఆర్ఓ బి.శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు.

పటాన్‌చెరులో ...5 నామినేషన్లు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో ఐదు నామినేషన్‌లు దాఖలయ్యాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ తరపున ఆయన సతీమణి కవిత, బీజేపీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ తరపున ఆయన కుమారుడు ఆశిష్‌గౌడ్ నామినేషన్లు దాఖలు చేశారు. ఆదిలాబాద్ ఇచ్చోడ మండలంకు చెందిన లక్ష్మణ్ ధర్మ సమాజ్ పార్టీ నుంచి నామినేషన్ వేశారు.అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులుగా చిట్కుల్ గ్రామానికి చెందిన మన్నె రాములు, ఇస్నాపూర్‌కు చెందిన ఖదీర్ మొహియుద్దీన్‌లు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజకు అందజేశారు.

నేడు బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ నామినేషన్

గచ్చిబౌలి: బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ నేడు ర్యాలీగా వచ్చి నామినేషన్ వేయనున్నారు. వివేకానందనగర్‌లోని ఆయన నివాసం నుంచి బుధవారం ఉదయం 7 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుంది. ఉదయం 8.30 గంటలకు తారానగర్‌లోని తుల్జా భవానీ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళతారు. అనంతరం ఉదయం 11 గంటలకు నామినేషన్ వేయనున్నారు. బైక్‌పై వచ్చే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని వారు సూచించారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డా.సయ్యద్ మహ్మద్ అలీ అహ్మద్, డాక్టర్ మధు

మాదాపూర్: బోదకాలు (50 కేజీల) సమస్యతో బాధపడుతున్న సోమాలియా యువతికి మెడికవర్ ఆసుపత్రి డాక్టర్లు విజయవంతంగా చికిత్స నిర్వహించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో డాక్టర్ సయ్యద్ మహ్మద్ అలీ అహ్మద్, డాక్టర్ మధులు మాట్లాడుతూ సోమాలియాకు చెందిన 18 సంవత్సరాల యువతికి గత 7 సంవత్సరాల నుంచి ఎడమకాలు వాపు ఉంది. క్రమంగా వాపు పెరగడం మొదలైంది. పలు హాస్పిటళ్లను సంప్రదించినప్పటికి ఫలితం లేకపోవడంతో చివరికి మెడికవర్ ఆసుపత్రికి చేరుకున్నారు. రోగికి లింఫెడెమా నాస్ట్రస్ వెరుకోసా (బోదకాలు) అని గుర్తించి డాక్టర్లు దశలవారీగా శస్త్రచికిత్స ద్వారా కణజాలాలను తొలగించారు. సమావేశంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం సినీనటి శుభశ్రీ రాయగురు, శ్రీలేఖ, నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరవాసులను ఆకట్టుకునే విధంగా వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు గృహాలంకరణ ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.

శ్రీవారికి అభిషేకం



హఫీజ్‌పేట్ : వేంకటేశ్వరస్వామి అష్టవింశ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం నిత్యోపాసన, ఉత్సవాస్త స్నపనంను వైభవంగా నిర్వహించారు. ఉదయం మహా సుదర్శన హోమం, మధ్యాహ్నం 12.00 గంటలకు హారతి తీర్థప్రసాదాలు అందించారు. శ్రీవారికి పుష్పాలంకరణ, గరుడ వాహన సేవ, అన్నప్రసాద వితరణ, సహస్ర దీపాలంకార సేవను కె.సత్యనారాయణ రాజు నిర్వహించారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

హఫీజ్‌పేట్: హస్తం గుర్తుకే ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పూజితగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలీనగర్, హుడా కాలనీలలో ఆమెతో పాటు కుమార్తె హారికగౌడ్‌లు కలిసి ఇంటింటి ప్రచారం చేశారు.

ఎర్రచందనం చెట్లకు సెన్సార్ చిప్‌ల అమరిక

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో 50 ఎర్రచందనం చెట్లకు రియల్ టైమ్ మానిటరింగ్ ఐఓటీ ఎలక్ట్రానిక్ చిప్ సెన్సార్‌ను అమర్చినట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం సీబీఐఓటీ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన ఎలక్ట్రానిక్ చిప్ సెన్సార్ గురించి డెమో, సెమినార్‌ను మంగళవారం బొటానికల్ గార్డెన్‌లోని సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిప్ అమర్చిన చెట్లను ఎవరైనా నరికి వేయాలనుకున్నా, దొంగిలించాలనుకున్నా సెక్యూరిటీ మొబైల్‌కు సందేశం వస్తుందని, అలాగే బొటానికల్ గార్డెన్‌లో అమర్చిన హూటర్ పరికరాన్ని యాక్టివేట్ చేయడం ద్వారా ఎలక్ట్రానిక్ సైరన్ మోగి సెక్యూరిటీ సిబ్బంది అలర్ట్ అవుతారని చెప్పారు. సమావేశంలో టీఎస్ఎఫ్‌డీసీ ఎకో టూరిజమ్ ప్రాజెక్టు మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్లు లక్ష్మారెడ్డి, మధుసూదన్, సీబీఐఓటీ టెక్నాలజీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ విష్ణు, టిఎస్ఎఫ్‌డీసీ శాంసన్‌రాజు, వీరబాబు, వెంకటేస్, ఎఫ్‌సీఆర్ఐ, తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, కంటోన్మెంట్ బోర్డు, హెచ్ఎండీఏ, హెచ్‌సీయూ, ఎన్‌జీఆర్ఐ, బయోడైవర్సిటీ బోర్డు, ఎస్ఐఆర్‌డీ, టీఎస్‌పీఏ, జీహెచ్ఎంసీ, ఓయూ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుపై వాహనాలు నిలిపితే జరిమానా : సీఐ పవన్‌కుమార్

● అక్రమ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల నజర్

● కార్లు, బైక్‌లు స్టేషన్‌కు తరలింపు



సాక్షి ఎఫెక్ట్..

హఫీజ్‌పేట్ : గత రెండు రోజుల క్రితం సాక్షి దినపత్రికలో చందానగర్ జాతీయ రహదారిపై అర కిలోమీటర్... అరగంట కథనంపై ఆర్సీపురం ట్రాఫిక్ పోలీసులు మంగళవారం స్పందించారు. అక్రమంగా రోడ్డుపై నిలిపిన వాహనాలకు చలాన్లతో పాటు స్టేషన్‌కు తరలించారు. సీఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపినా, పార్క్ చేసినా సీజ్ చేస్తామని ,అదే విధంగా చిరు వ్యాపారులు రోడ్డుపై వ్యాపారాలు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్‌కే రెడ్డి సంక్షేమ సంఘం మద్దతు

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గం రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ బీఆర్ఎస్ పార్టీకే పూర్తి మద్దతు ఇస్తుందని రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం చందానగర్‌లో జరిగిన సమావేశంలో కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రెడ్డి సంక్షేమ సంఘం భవనం కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ..250 గజాల స్థలంను కేటాయించారని, నిర్మాణం కోసం కూడా సహకరిస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం కో ప్రెసిడెంట్ పోరెడ్డి సంజీవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాంచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శులు టి.గోవర్ధన్‌రెడ్డి, జి.రవీందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు జి. రంగారెడ్డి, టి.మోహన్‌రెడ్డి, ట్రెజరర్ డి.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీలకు రాజ్యాధికారం

● పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్



ఆత్మగౌరవ సభకు తరలుతున్న బీజేపీ శ్రేణులు

గచ్చిబౌలి: బీజేపీ అధికారంలోకి వస్తేనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఎల్‌బీ స్టేడియంలో బీసీల ఆత్మ గౌరవసభకు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, నాయకులు రాధాకృష్ణ యాదవ్, సదానంద్, నర్సింహ్మా యాదవ్, విజయలక్ష్మీ, రమేష్, సుశీల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు స్వర్గధామం

● పటాన్‌చెరు పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు

● కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

● కేసీఆర్ కృషితోనే గిరిజనుల అభివృద్ధి

● నియోజవర్గం అభివృద్ధే లక్ష్యం

● బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి



ఫౌండ్రీస్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో పరిశ్రమలకు స్వర్గధామంగా పటాన్‌చెరు నియోజకవర్గం రాష్ట్రానికి తలమానికంగా నిలిచిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పాటి గ్రామ చౌరస్తాలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పటాన్‌చెరు ఫౌండ్రీస్ అసోసియేషన్ సమావేశానికి శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా పారిశ్రామికరంగం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సులభతర వాణిజ్య విధానం తీసుకొచ్చి నూతన పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో నేడు 6వేలకు పైగా పరిశ్రమలు వివిధ ఉత్పత్తులను కొనసాగిస్తూ అనేకమంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్నాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, శంకర్‌యాదవ్, అసోసియేషన్ ప్రతినిధులు ఆనందరెడ్డి, వెంకటేశ్వర్లు, ఐలా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రంజిత్ భారీసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కులవృత్తులకు జీవం..

ఉనికి కోల్పోతున్న కులవృత్తులకు జీవం పోసిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్‌లో ఏర్పాటుచేసిన నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ విజయానికి తోడ్పాటును అందించాలని కోరారు. అనంతరం నాయీ బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్‌కే తమ మద్దతు అని సంఘం ప్రతినిధులు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహాగౌడ్, సీనియర్ నాయకులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలోని ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ఫొటోగ్రాఫర్ల భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనిల్, మాజీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, పవన్, శంకర్ పాల్గొన్నారు.

తండాల అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేసిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు దేవులపల్లితండాలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండాకు చెందిన 100 మందికిపైగా బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని నడిబొడ్డున గిరిజనుల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, వైస్‌చైర్మన్ రాములుగౌడ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సముచిత స్థానం కల్పిస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్ఎస్‌లో చేరిన ప్రతిఒక్కరికీ సముచితస్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ, బీహెచ్ఇఎల్ కాలనీలకు చెందిన ఆశ్వింత్, శ్రీనివాస్, భాను, హరికృష్ణ ఆధ్వర్యంలో 120 మంది యువకులు మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రమోద్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఉపసర్పంచ్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని లక్ష్మిపతిగూడెం ఉపసర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడిపల్లి అశోక్, కొర్లకుంట కేఎస్‌జీ యువసేన నాయకులు రాజు, మామిడిపల్లి రమేష్, తదితరులు ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. నాయకులు వెంకటేష్‌గౌడ్, నల్తూరు సర్పంచ్ జనార్దన్, పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం



అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ప్రచారం నిర్వహిస్తున్న తుమ్మల పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: బీఆర్ఎస్‌తోనే సంక్షేమం,అభివృద్ధి సాధ్యమని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలో 2, 7వ వార్డుల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు గుర్తుపై ఓటు వేసి మహిపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, రాజు, కల్పనఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు తుమ్మల రుష్వంత్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, సిద్దిపేట రాంరెడ్డి, భిక్షపతి, సిద్దిపేట శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, నాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు



కొల్లూరు దేవులపల్లి తండావాసులతో ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరుతున్న లక్ష్మిపతిగూడెం ఉపసర్పంచ్ అశోక్, కాంగ్రెస్ నాయకులు